తెలుగు దినపత్రిక

సూర్యోదయ వార్త

ప్రతి అక్షరం ప్రజల కోసం...

తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి: 2 | సంచిక : | శనివారం17.10. 2026 | పేజీలు :4 | వెల: 2

గౌతమ్‌పూర్‌లో చెట్ల తొలగింపు బిల్లులపై వివాదం!



- రెండు రోజుల పనులకు రూ.61 వేల బిల్లా?
- ప్రజాధనం దుర్వినియోగంపై గ్రామస్థుల అనుమానాలు.. సమగ్ర విచారణకు డిమాండ్

కొత్తగూడెం, అక్టోబర్ 16 (సూర్యోదయ వార్త)

గౌతమ్‌పూర్ గ్రామపంచాయతీలో చెట్ల కొమ్మల తొలగింపు పనులకు సంబంధించిన బిల్లుల వ్యవహారం వివాదాస్పదంగా మారింది. పనులకు అయిన ఖర్చు, బిల్లుల్లో చూపించిన మొత్తాల మధ్య వ్యత్యాసం ఉందంటూ గ్రామస్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల పాటు చెట్ల కొమ్మలు తొలగించిన పనులకు రూ.61 వేల బిల్లు ఎలా వచ్చిందని ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని గౌతమ్‌పూర్ గ్రామపంచాయతీ పరిధిలో ఇప్పటికే కోతులు, కుక్కల బెడదను పరిష్కరించాలని కోరుతూ గ్రామస్థులు గ్రామసభను బహిష్కరించిన ఘటన చర్చనీయాంశంగా మారింది. తాజాగా చెట్ల కొమ్మల తొలగింపు పనులకు సంబంధించిన బిల్లులపై ఆరోపణలు తెరపైకి రావడంతో పంచాయతీ నిధుల వినియోగంపై చర్చ మొదలైంది.

గ్రామపంచాయతీ పరిధిలోని వివిధ కాలనీల్లో చెట్ల కొమ్మల తొలగింపు పనులకు సంబంధించి బిల్లులు సమర్పించినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. పనులు చేసిన కూలీల వేతనాలు, పని చేసిన రోజులు, బిల్లుల్లో చూపించిన మొత్తాలపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వాస్తవంగా చేసిన పనులకు, రికార్డుల్లో నమోదైన వివరాలకు మధ్య వ్యత్యాసం ఉందని ఆరోపిస్తున్నారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు రెండు నెలల క్రితం మిలీనియం క్వార్టర్స్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు పనుల కోసం ముగ్గురు వ్యక్తులు రెండు రోజులు పనిచేయగా, రికార్డుల్లో నాలుగు రోజుల పనిగా నమోదు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒక్కొక్కరికి రోజుకు రూ.1,200 చొప్పున వేతనం నమోదు చేసినట్లు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా, ఇటీవల గౌతమ్‌పూర్ కాలనీల్లో చెట్ల కొమ్మల తొలగింపు పనులకు రూ.61 వేల బిల్లు పెట్టినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. రెండు మూడు రోజుల పాటు ఇద్దరు లేదా ముగ్గురు వ్యక్తులు పనిచేసిన పనులకు ఇంత పెద్ద మొత్తంలో బిల్లు ఎలా వచ్చిందని ప్రశ్నిస్తున్నారు. అయితే, బిల్లుల వివరాలు, పనుల పూర్తి స్థాయి, చెల్లింపులపై అధికారికంగా పరిశీలన జరగాల్సి ఉంది.

గ్రామపంచాయతీ నిధులతో చేపట్టే పనులకు సంబంధించిన బిల్లులను నిబంధనల ప్రకారం పరిశీలించి, పనుల వివరాలతో సరిపోల్చిన తర్వాతే చెల్లింపులు జరగాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో చెట్ల కొమ్మల తొలగింపు పనులకు సంబంధించిన బిల్లులు ఏ ప్రాతిపదికన రూపొందించారు? పనుల పరిమాణం, కూలీల సంఖ్య, పని చేసిన రోజులు, వేతనాల వివరాలను పరిశీలించారా? క్షేత్రస్థాయిలో పనులను తనిఖీ చేశారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. బిల్లుల తయారీ, ఆమోదం, చెల్లింపుల ప్రక్రియలో నిబంధనలు పాటించారా లేదా అన్నది సంబంధిత అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ఈ వ్యవహారంలో అక్రమ చెల్లింపులు జరిగినట్లు నిర్ధారణ కాలేదు. అధికారిక విచారణతోనే వాస్తవాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

బహిరంగ విచారణ జరపాలి : బీజేపీ నాయకుడు సొప్పరి క్రాంతి

చెట్ల కొమ్మల తొలగింపు పనులకు సంబంధించిన తీర్మానాలు, బిల్లులు, కూలీల వేతనాల వివరాలు, చెల్లింపుల రికార్డులను బహిరంగంగా పరిశీలించాలని బీజేపీ నాయకుడు సొప్పరి క్రాంతి కోరుతున్నారు. పంచాయతీ నిధుల వినియోగంలో పారదర్శకత పాటించాలని, ప్రజాధనం దుర్వినియోగమైనట్లు తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో జరిగిన పనులను రికార్డులతో సరిపోల్చి, బిల్లుల రూపకల్పన నుంచి చెల్లింపుల వరకు జరిగిన ప్రక్రియపై సమగ్ర విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

తీర్మానం ప్రకారమే చేశాం: పంచాయతీ కార్యదర్శి షర్మిల

ఈ ఆరోపణలపై గౌతమ్‌పూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి షర్మిలను వివరణ కోరగా.. చెట్ల కొమ్మల తొలగింపు పనులకు సంబంధించి తీర్మానంలో రూ.61 వేలు నమోదు చేశారని, రెండు రోజుల పాటు పనులు జరిగాయని తెలిపారు. సుమారు రెండు నెలల క్రితం మిలీనియం క్వార్టర్స్‌లో ముగ్గురు వ్యక్తులు రెండు రోజులు పనిచేసినందుకు రూ.30 వేలు చెల్లించినట్లు పేర్కొన్నారు. ఈ చెల్లింపులన్నీ తీర్మానం ప్రకారమే చేశానని, ఇందులో తనకు సంబంధం ఏముందని ఆమె వ్యాఖ్యానించారు.

అయితే, తీర్మానంలో పేర్కొన్న మొత్తాలు, వాస్తవంగా జరిగిన పనులు, కూలీలకు చెల్లించిన వేతనాలు, బిల్లుల వివరాల మధ్య ఉన్న సంబంధంపై స్పష్టత రావాల్సి ఉంది. గ్రామస్థులు లేవనెత్తిన అనుమానాలపై సంబంధిత అధికారులు రికార్డులను పరిశీలించి వాస్తవాలను వెల్లడిస్తారా? సమగ్ర విచారణకు ఆదేశిస్తారా? అన్నది వేచి చూడాలి.

వేములవాడలో ఘనంగా బతుకమ్మ వేడుకలు.

వేములవాడ: దక్షిణ కాశీగా పేరుగాంచి.. శ్రీ రాజరాజేశ్వర స్వామి వారు కొలువై ఉన్న వేములవాడ పట్టణంలో ఏడోద్దుల సద్దుల బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ప్రపంచవ్యాప్తంగా తొమ్మిది రోజులకు బతుకమ్మ వేడుకలను జరుపుకోనుండగా వేములవాడలో మాత్రం ఏడు రోజులకే జరుపుకోవడం తరతరాలుగా వస్తున్న అనవాయితీ. పురాణాలలోను ఎములాడ ఏదోద్దుల బతుకమ్మకు ఘనమైన చరిత్ర ఉంది. ఈ క్రమంలో శుక్రవారం పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో బతుకమ్మ పండుగను మహిళ సోదరీమణులు కన్నుల పండుగగా జరుపుకున్నారు. వేడుకల్లో భాగంగా తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి మహిళలు అందరూ ఒక్కదగ్గర చేరి "బతుకమ్మ...బతుకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ ఉయ్యాలో.. బతుకులు మార్చమ్మా ఉయ్యాలో" అంటూ ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం మూలవాగుకు వద్దకు చేరుకుని భక్తి శ్రద్ధలతో పేర్చిన బతుకమ్మలను బతుకమ్మ తెప్పేతో పాటు గలగల పారుతున్న మూలవాగులో వేసి గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో మూలవాగు కాస్త పూల వాగుగా మారింది. మహిళల ఆటపాటలతో, కోలాటాలతో మూల వాగు ప్రాంతమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ వేడుకలను చూసేందుకు పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుండి వేలాది సంఖ్యలో ప్రజల తరలివచ్చారు. వేములవాడ కోడలుగా, తెలంగాణ ఆడబిడ్డగా వేములవాడలో జరిగే బతుకమ్మ వేడుకలకు అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపకురాలు విమలక్క ప్రతి ఏటా హాజరవుతుంటారు. ఈ క్రమంలో ఏడాది సైతం వేములవాడలో జరిగిన వేడుకలకు విమలక్క హాజరై 20వ వార్డు కౌన్సిలర్ కుమ్మరి శంకర్ నివాసంలో బహుజన బతుకమ్మ పేర్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి, స్వయం సంవృద్ధి, రైతుల హక్కులు, ఆదివాసీల పరిరక్షణ అనే నినాదంతో ఈ ఏడాది బహుజన బతుకమ్మ వేడుకలు జరుపుతున్నామని, జెన్ జీ యువత దేశంలోని మానవ హక్కులు, రైతుల కష్టాలు, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పోరాటాలు చేయాలని, ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేశ్ కుమార్ అంశంపై జెన్ జీ యువత చేస్తున్న పోరాటానికి మద్దతు



ఇస్తున్నామని, ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి దేశ యువత చేస్తున్న న్యాయపరమైన పోరాటానికి స్పష్టి పలకాలని కోరారు.

మోదీకి వ్యతిరేకంగా విద్రోహ శక్తుల కుట్రలు

- కాంగ్రెస్‌ది బ్లాక్‌మెయిల్, దిగజారుడు రాజకీయం
- అజిత్ దోవల్ వంటి వారిని రాజకీయాల్లోకి లాగడం దుర్మార్గం
- 'సర్'పై ప్రాథమిక పరిజ్ఞానం లేని రాహుల్
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధ్వజం



హైదరాబాద్: శ్రీలంకలో ప్రభుత్వాన్ని కూల్చిన మాదిరిగానే భారత్‌లోనూ ఎన్డీయే ప్రభుత్వాన్ని కూల్చేస్తామని రాహుల్ గాంధీ దింపుడు కళ్లం ఆశలు పెట్టుకున్నారని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండి పడ్డారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాహుల్ గాంధీకి దమ్ముంటే ప్రజాదరణతో ఎన్నికైన మోదీ ప్రభుత్వాన్ని పడగొట్టి చూడావని సవాల్ విసిరారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో ఎన్నికల నిర్వహణ యావత్ ప్రపంచానికే ఆదర్శమని, స్వతంత్ర వ్యవస్థ అయిన ఎన్నికల కమిషన్‌పై బురద చల్లేందుకు రాహుల్ నిరంతరం యత్నిస్తున్నారని దుయ్యబట్టారు. దేశ భద్రతను కాపాడుతూ ప్రజల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్న జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్‌ను రాజకీయాల్లోకి లాగడం తరువాయి 2లో..

ప్లాంట్ ఏర్పాటు చేయండి

- హ్యుందాయ్ యాజమాన్యానికి సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు
- జహీరాబాద్‌లో రూ.8,528 కోట్లతో గ్లోబల్ ఆర్‌అండ్‌డీ కేంద్రం
- పెండింగ్ అనుమతులను వెంటనే పూర్తి చేయాలి



హైదరాబాద్: తెలంగాణను కార్ల తయారీకి అనువైన ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దేం దుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో హ్యుందాయ్ కార్ల తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని ఆ సంస్థ యాజమాన్యాన్ని కోరారు. రాష్ట్రంలో తయారీ రంగాన్ని ప్రోత్సహించేందుకు అన్ని రకాల సహాయసహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. జహీరాబాద్‌లో ఏర్పాటు చేయనున్న హ్యుందాయ్ గ్లోబల్ ఆర్‌అండ్‌డీ కేంద్రానికి సంబంధించిన పెండింగ్ అనుమతులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజినీరింగ్ (హెచ్ఎంఐఈ) మేనేజింగ్ డైరెక్టర్ చాంగ్యూన్ చో నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో శుక్రవారం సమావేశమైంది. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, జహీరాబాద్‌లో ప్రతిపాదిత ప్రాజెక్టు పురోగతిపై చర్చించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మాన్యుఫాక్చరింగ్ జోన్ (నిమ్స్)లో రూ.8,528 కోట్ల పెట్టుబడితో హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజినీరింగ్ ఇంటిగ్రేటెడ్ గ్లోబల్ ఆర్ అండ్ డీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. 678 ఎకరాల్లో విడతలవారీగా అభివృద్ధి చేయనున్న ఈ ప్రాజెక్టు ద్వారా మొత్తం 4,276 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. ప్రాజెక్టు పురోగతిని హ్యుందాయ్ ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. రాబోయే తరువాయి 2లో..



కరువు నివారణలో సీఎం

అట్టర్ ఫ్లాప్

- రేవంత్ అవగాహనా రాహిత్యంతోనే సమస్య
- రైతు కూలీలకు ఏడాదికి రూ.12వేలు ఇవ్వాలి
- పవర్ మ్యాక్స్ కంపెనీతో ఒప్పందం బయటపెట్టాలి
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత



రేవంత్ రెడ్డి ఈఎంఐ సీఎం

అధిష్ఠానానికి ఈఎంఐలు కట్టకపోతే పదవి నిలవదు

- విద్యుత్, సాగునీటి సంక్షోభాలకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణం
- ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు
- సంక్షోభాన్ని సృష్టించి బొగ్గు కొంటామంటూ నాటకాలు
- సీఎం హయాంలో జరిగిన అక్రమాలపై న్యాయ విచారణ జరపాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2

41 బార్లకు లక్కీ డ్రా పూర్తి

- మొత్తం 8,770 దరఖాస్తులు
- హైదరాబాద్‌లోని 14 బార్ల కోసం 4,251 మంది పోటీ
- జిల్లాల్లోని 27 బార్లకు 4,519 దరఖాస్తులు



2

కాంగ్రెస్ కార్యకర్త కుటుంబానికి మంత్రి సీతక్క ఆర్థిక సహాయం..

మంగపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు



మంగపేట. ములుగు జిల్లా అక్టోబర్ 16(సూర్యోదయ వార్త.)

ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ఇండ్ల యాకయ్య తల్లి రామక్క ఇటీవల మరణించిన విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు పార్టీ నాయకులతో కలిసి వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా రామక్క చిత్రపటానికి పూలమాలవేసి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క తరపున,మృతురాలి దశదిన కర్మ ఖర్చుల నిమిత్తం రూ. 5,000 ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగింది.బాధిత కుటుంబానికి అండగా నిలిచి,వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని,కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.ఈ పరామర్శలో జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి చింత పున్నారావు,జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య,జిల్లా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ సభ్యులు మురుకుట్ల నరేందర్,జిల్లా నాయకులు మాసిరెడ్డి వెంకటరెడ్డి,మండల నాయకులు శానం సత్యనారాయణ మరియు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి మండపంలో ప్రత్యేక పూజలు.. అన్నదానం ప్రారంభించిన వనమా రాఘవేంద్రరావు



కొత్తగూడెం, (సూర్యోదయ వార్త)

కొత్తగూడెం రామవరం ప్రాంతంలోని 16వ డివిజన్ పంజాబీగడ్డ ఇందిరమ్మ కాలనీలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాన్ని వనమా రాఘవేంద్రరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమ్మవారి ఆశీస్సులతో కొత్తగూడెం నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీవీ రిపోర్టర్ శివ, ఉమాకాంత్, కోటేశ్వరరావు, గౌస్, సురేందర్, ఆవునూరి చంద్రయ్య, కొయ్యడ శీను, రెడ్డి బ్రదర్స్, గాదం రాజేందర్, సిరాజ్, లచ్చిరాం, పూర్ణ, శ్రీను, బొందుగుల శ్రీధర్, అచ్చా నరేందర్, మంజుల తదితరులు పాల్గొన్నారు. డివిజన్ ప్రజలు, అమ్మవారి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజల్లో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా అయ్యోరి యానయ్య..



మంగపేట. అక్టోబర్ 16(సూర్యోదయ వార్త)

ములుగు జిల్లా స్థాయిలో ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నాపై నమ్మకం ఉంచి, ఈ కీలక బాధ్యతను అప్పగించినందుకు తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమం, గ్రామీణ మంచినీటి సరఫరాల శాఖల మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క కు , ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్., రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ సెక్రటరీ కుంజ సూర్య గారికి హృదయపూర్వక ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.అదేవిధంగా,నా నియామకానికి సహకరించిన మంగపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుచెట్టిపెల్లి వెంకటేశ్వర్లు , తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య అలాగే నా నియామకానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు,ప్రజాప్రతినిధులు, కార్యకర్తలందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ,ములుగు జిల్లాలోని గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేయడంతో పాటు, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి పార్టీ బలోపేతానికి నా వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా హామీ ఇస్తున్నాను... ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నూతన మండల అధ్యక్షుడు విక్రాంత్‌కు ఘన సన్మానం..

గుమ్మడిదొడ్డి సర్పంచ్ భోదెబోయినా భరత్ కుమార్..



వాజేడు, అక్టోబర్ 16 (సూర్యోదయ వార్త):

– ములుగు జిల్లా వాజేడు మండల నూతన మండల అధ్యక్షుడిగా నియమితులైన కాకర్లపూడి విక్రాంత్‌ను గుమ్మడిదొడ్డి గ్రామ సర్పంచ్ భోదెబోయినా భరత్ కుమార్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విక్రాంత్‌కు శుభాకాంక్షలు తెలియజేసి, ఆయన నాయకత్వంలో మండల అభివృద్ధి మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.నూతన బాధ్యతలు చేపట్టిన విక్రాంత్ ప్రజలకు అందుబాటులో ఉంటూ, మండల అభివృద్ధికి కృషి చేయాలని సర్పంచ్ భరత్ కుమార్ కోరారు.

సేవ్ టు నో డ్రగ్ అనే నీనాదంతో దూసుకు వెళ్తున్న విపిఎల్ సీజన్-3

వెంకటాపురంలో హోరా హోరిగా సాగుతున్న క్రికెట్ పోటీలు..

వెంకటాపురం. నూగూరు. అక్టోబర్ 16(సూర్యోదయ వార్త)

దసరా మహోత్సవం సందర్భంగా ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో కాఫెడ్ మైదానంలో నిర్వహిస్తున్న వెంకటాపురం క్రికెట్ అసోసియేషన్ వీ సి ఏ వెంకటాపురం ప్రీమియర్ లీగ్ సీజన్ 03 లో భాగంగా ఆరవ రోజు కొనసాగుతున్న క్రికెట్ టోర్నీ సేవ్ టు నో డ్రగ్ అనే నినాదంతో దూసుకు వెళ్తున్న విపిఎల్ సీజన్ 3.సాయి చేయూత సోల్జర్స్ వర్సెస్ హంటర్స్ మధ్య జరిగిన మ్యాచ్లో ముందుగా టాస్ గెలిచి హంటర్స్ ఫీల్డింగ్ ఎంచుకోగా.మొదట బ్యాటింగ్ చేసిన సాయి చేయూత సోల్జర్స్ నిర్ణీత 10 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 58పరుగులు చేసింది.సెకండ్ బ్యాటింగ్ దిగిన హంటర్స్ 7.2 ఓవర్లలోనే 62 పరుగులు చేసి విజయ లక్ష్యాన్ని చేదించింది.ఈ మ్యాచ్లో ఉత్తమ ప్రతిభ ను కనబరిచిన పండు కి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ఇవ్వడం జరిగింది.ఎస్ ఎస్ వారియర్స్ వర్సెస్ స్టార్ లెవెల్ జరిగిన మ్యాచ్లో ముందుగా టాస్ గెలిచి స్టార్ లెవెన్ ఫీల్డింగ్ ఎంచుకున్న



ది మొదట బ్యాటింగ్ చేసిన ఎస్ ఎస్ వారియర్స్ నిర్ణీత 10 ఓవర్స్ లో 98 అత్యధిక పరుగులు చేసింది. 5 వికెట్లు కోల్పోవడం జరిగిందిసెకండ్ బ్యాటింగ్ దిగిన స్టార్ లెవెన్ ఉత్కంఠంగా సాగిన మ్యాచ్లో10 ఓవర్స్ లోనే 5వికెట్లు కోల్పోయి 101 పరుగులు విజయం సాధించింది.ఈ మ్యాచ్లో అద్భుతమైన బ్యాటింగ్ చేసి 30 బంతుల్లో 7సిక్సులతో 55 పరుగులు తో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన భాను ప్రకాష్ కి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గా ఇవ్వడం జరిగింది. సాయి చేయూత సోల్జర్స్ వర్సెస్ సాయి మెస్ లెవెన్ మధ్య జరిగిన సాయి మెస్ 11 టాస్ గెలిచి బౌలింగ్ చేయడం జరిగింది.మొదట బ్యాటింగ్ దిగిన సాయి చేయూత సోల్జర్స్ నిర్ణయిత 8.5 ఓవర్ లో



10 వికెట్ల నష్టానికి 62పరుగులు చేసింది.సెకండ్ బ్యాటింగ్ దిగిన సాయి మెస్ లెవెన్ ఉత్కట్టంగా జరిగిన మ్యాచ్లో 7.1 ఓవర్స్ లో 64పరుగులు చేసి 6వికెట్లు కోల్పోయి దుర్గమ్మ లెవెన్ విజయం సాధించింది. ఈ మ్యాచ్ లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన చింటూ కి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ఇవ్వడం జరిగింది...

- శుక్రవారం టోర్నీ హైలెట్స్.

ఉత్తమ ప్రదర్శన కనబరిచిన స్టార్స్ 11 ప్లేయర్ భాను ప్రకాష్ కి చీఫ్ గెస్ట్ గా విచ్చేసిన మండల పరిషత్ డెవలప్మెంట్ ఆఫీసర్ వీ . ప్రవీణ్ కుమార్ చేతుల మీదుగా మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ఇచ్చి సత్కరించడం జరిగింది .

గుంటూరులో ప్రపంచ చేతులు శుభ్రం దినోత్సవం - ఉత్తమ స్వచ్ఛంద సేవకులకు అవార్డులు

సుజాత నగర్ సూర్యోదయ వార్త 16 అక్టోబర్ :

ప్రపంచ చేతులు శుభ్రం దినోత్సవం సందర్భంగా, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుంటూరులోని స్టేట్ పెన్షనర్స్ హాల్ నందు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలో సేవా కార్యక్రమాలలో విశేష కృషి చేసిన ఉత్తమ స్వచ్ఛంద సేవకులకు "ఉత్తమ సేవా పురస్కారం"ప్రధానం చేయడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డి .జి .పి .) కార్యాలయం, ఆన్ స్పెషల్ డ్యూటీ ఆఫీసర్ శ్రీ అశోక్ బాబు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాది శ్రీమతి శైలజ మరియు హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ నేషనల్



ప్రెసిడెంట్ డాక్టర్ బొడ్డపాటి దాసు హాజరై, అవార్డు గ్రహీతలను సత్కరించారు.ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ నేషనల్ జనరల్ సెక్రటరీ డాక్టర్ కె. ఇందిరా ప్రియదర్శిని, నేషనల్ సెక్రటరీ శ్రీమతి జె. శ్రీ శ్రీనిలత, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ప్రెసిడెంట్ కె. భాస్కర్, తెలంగాణ స్టేట్ ప్రెసిడెంట్ కాల్వ సుధాకర్ రావు, భద్రాద్రి కొత్తగూడెం డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ రాందాస్ నాయక్, భద్రాద్రి జిల్లా అడ్వైసరీ కమిటీ అధ్యక్షులు షేక్ అబ్బాస్ , భద్రాద్రి జిల్లా కన్వీనర్ మాతంగి రాధ, భద్రాద్రి జిల్లా ఇంచార్జ్ సామ్యూల్, భద్రాద్రి జిల్లా గౌరవ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. దుర్గా భవాని, జిల్లా జాయింట్ సెక్రటరీ శోభారాణి, జిల్లా కో-ఆర్డినేటర్ షేక్ షరీఫ్,చుంచుపల్లి మండల ప్రెసిడెంట్ షేక్ షబ్బీర్ జిల్లా కమిటీ సభ్యులు విజయలక్ష్మి, సంధ్య, యాదగిరి, మొహమ్మద్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ పండుగ వేళ ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల పంపిణీ

- రూ.5.45 కోట్ల నిధులతో 109 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం..
- పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక..
- వచ్చే ఏడాది సొంతింట్లో బతుకమ్మ సంబరాలు.
- ఇందిరమ్మ ఇండ్లతో పేదల జీవితాల్లో అభివృద్ధి వెలుగులు..
- ప్రకృతి మార్పులతో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు..
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి - దనసరి అనసూయ సీతక్క..

గోవిందరావుపేట. ములుగు. అక్టోబర్ 16(సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక అత్యంత పారదర్శకంగా జరుగుతోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. బతుకమ్మ పండుగ వేళ రెండో విడత లబ్ధిదారులకు ఇండ్ల మంజూరు పత్రాలను అందజేస్తున్నామని, వచ్చే ఏడాది వారు తమ సొంతింట్లో బతుకమ్మ సంబరాలను వైభవంగా జరుపుకుంటారని పేర్కొన్నారు.శుక్రవారం గోవిందరావుపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.



జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావుతో కలిసి మండల పరిధిలోని 13 గ్రామాలకు చెందిన 109 మంది లబ్ధిదారులకు ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.5.45 కోట్ల నిధులతో నిర్మించనున్న ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ సొంత నివాసం లేక ఇబ్బందులు పడుతున్న పేదలను గుర్తించి, వారి సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ములుగు నియోజకవర్గంలో మొదటి విడతలో సుమారు ఐదు వేల ఇండ్లను మంజూరు చేశామని, రెండో విడతలోనూ అర్హులైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తున్నామని పేర్కొన్నారు. ప్రస్తుత విడతలో ఇండ్లు రాని అర్హులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తదుపరి విడతల్లో అవకాశం కల్పిస్తామని భరోసా ఇచ్చారు.పేదలందరికీ సొంత నివాసం ఉండాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ ఇండ్ల పథకానికి ప్రాధాన్యం ఇస్తున్నారని మంత్రి అన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వం కేటాయించిన నిధులను సద్వినియోగం చేసుకొని ఇండ్ల నిర్మాణాలను చేపట్టాలని సూచించారు. పునాది స్థాయి నిర్మాణం పూర్తయిన తర్వాత బిల్లుల చెల్లింపులు ప్రారంభమవుతాయని తెలిపారు. మహిళా సంఘాల్లో సభ్యులుగా ఉన్న లబ్ధిదారులకు ప్రారంభ నిర్మాణ ఖర్చుల కోసం సంఘాల ద్వారా రూ.లక్ష రుణం పొందే అవకాశం ఉందని వివరించారు.ఇండ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుకను స్థానికంగా అందుబాటులో ఉంచేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. లబ్ధిదారుల వివరాలను ధ్రువీకరించి, నిబంధనల ప్రకారం ఇసుక అందించేలా జిల్లా కలెక్టర్, అటవీ శాఖ అధికారులు, తహసీల్దార్ చర్యలు చేపట్టాలని కోరారు. సర్పంచులు లబ్ధిదారులకు అండగా నిలిచి, ఇండ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా దగ్గరుండి సహకరించాలని సూచించారు.కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులు స్వీకరించామని, వాటికి సంబంధించిన క్షేత్రస్థాయి పరిశీలనను పూర్తి చేసి తదుపరి చర్యలు చేపడతామని మంత్రి తెలిపారు. గృహాలకు ఉచిత విద్యుత్, రేషన్ బియ్యం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్లు వంటి పథకాలతో ప్రజా ప్రభుత్వం ప్రజలకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.ఉపాధి హామీ పథకం కింద వంద రోజుల పనులను పెద్ద ఎత్తున కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. పని పరిమాణాన్ని బట్టి రోజుకు సుమారు రూ.310 వరకు కూలి పొందే అవకాశం ఉందన్నారు. పండుగ అనంతరం గ్రామాల్లో ఉపాధి పనులు విస్తృతంగా చేపట్టేలా సర్పంచులు చొరవ చూపాలని కోరారు. ఈ పనులతో కూలీలకు ఆదాయం సమకూరడంతో పాటు గ్రామాల అభివృద్ధికి తోడ్పాటు లభిస్తుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ప్రకృతి మార్పుల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ఇటువంటి పరిస్థితుల్లో అధికారులు ప్రజలకు అండగా నిలవాలని ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు..

తాడ్వాయి మండల సహకార సంఘం చైర్మన్‌గా బొల్లు దేవేందర్ ముదిరాజ్ బాధ్యతల స్వీకరణ

ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర మంత్రి వర్యులు సీతక్క..

తాడ్వాయి. ములుగు. అక్టోబర్ 16(సూర్యోదయవార్త. ములుగు ప్రతినిధి)

ములుగు జిల్లా తాడ్వాయి మండల సహకార సంఘం చైర్మన్‌గా బొల్లు దేవేందర్ ముదిరాజ్ గ బాధ్యతలు స్వీకరించారుఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంకిడి నరసింహ స్వామి గారి ఆధ్వర్యంలో నిర్వహించిన సహకార సంఘం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి వర్యులు శ్రీమతి సీతక్క గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు..ఈ సందర్భంగా మంత్రి సీతక్క నూతన చైర్మన్ బొల్లు దేవేందర్ ముదిరాజ్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. సహకార సంఘం ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించాలని, రైతుల సంక్షేమం కోసం కృషి చేయాలని ఆకాంక్షించారు.నూతన చైర్మన్ బొల్లు దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. సహకార సంఘం అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని, రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సహకార సంఘం అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, అభిమానులు తదితరులు పాల్గొని నూతన చైర్మన్‌కు శుభాకాంక్షలు





తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ , జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్, జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మద్దాల నాగమణి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి రాజేందర్, ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు,మాజీ సహకార సంఘం చైర్మన్ పులి సంపత్ గౌడ్, మేడారం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ అరేం లచ్చు పటేల్ , లింగాల గ్రామపంచాయతీ సర్పంచ్ - మొగిలిపల్లి రవీందర్ జిల్లా నాయకులు మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పూల పండుగొచ్చె.. కలెక్టరేట్ మురిసె!

- రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలతో పూలవనంగా మారిన కార్యాలయ ప్రాంగణం.
- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ.
- మహిళలు శాసించే స్థాయికి ఎదగాలి.
- రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క

ములుగు. అక్టోబర్ 16(సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానం నుంచి పుట్టిన విశిష్టమైన పండుగ బతుకమ్మ అని రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు.శుక్రవారం ములుగు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధ్యక్షతన నిర్వహించిన బతుకమ్మ సంబరాలకు మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించారు.అనంతరం మహిళా అధికారులు, ఉద్యోగులతో కలిసి మంత్రి బతుకమ్మ ఆడి పండుగ ఆనందాన్ని పంచుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏ స్థాయిలో ఉన్నా మన పూర్వీకుల నుంచి వచ్చిన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని సూచించారు. పూలను పూజిస్తూ ప్రకృతిని ఆరాధించే బతుకమ్మ పండుగకు ఎంతో విశిష్టత ఉందన్నారు. పసుపుతో గౌరమ్మను రూపొందించి పూజించడం వంటి ఆచారాల్లో సంప్రదాయంతో పాటు శాస్త్రీయ దృక్పథం కూడా మిళితమై ఉందని పేర్కొన్నారు.బతుకమ్మ పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ సంప్రదాయబద్ధంగా ఆడాలని సూచించారు. అందరూ కలిసి ఆడిపాడటం వల్ల ఆనందం, పరస్పర ఆత్మీయత పెరుగుతాయన్నారు.మహిళలు యాచించే స్థాయి నుంచి శాసించే స్థాయికి ఎదగాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన, ఆశయమని మంత్రి పేర్కొన్నారు. ఆ లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున మహిళా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆర్థికంగా, సామాజికంగా మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.ఉద్యోగులు తమ కుటుంబాలతో సంతోషంగా ఉంటూ, విధి నిర్వహణలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కష్టపడి పనిచేసి సాధించిన ఫలితం ఎంతో సంతృప్తిని, ఆనందాన్ని ఇస్తుందన్నారు. ప్రజల ముఖాల్లో సంతోషం నింపేలా అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ సద్దుల బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటిచెప్పే బతుకమ్మ పండుగ ప్రతి







ఒక్కరిలో ఆనందాన్ని, ఐక్యతను నింపుతుందని అన్నారు. తాను మహారాష్ట్రకు చెందినప్పటికీ తెలంగాణకు వచ్చిన తర్వాత ఇక్కడి బతుకమ్మ, దసరా వేడుకల విశిష్టతను తెలుసుకున్నానని తెలిపారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, మహిళలంతా కలిసి పాటలు పాడుతూ ఆడిపాడే దృశ్యం ఎంతో ఆకట్టుకుంటుందన్నారు. మహిళా అధికారులు, ఉద్యోగులు ఉత్సాహంగా ఈ సంబరాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. మంత్రి సూచించిన విధంగా మరింత అంకితభావంతో పనిచేసి ప్రజలకు సేవలందిద్దామని పిలుపునిచ్చారు. అందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలిపారు.రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలతో కార్యాలయ ప్రాంగణం పూలవనంగా మారింది. మహిళా ఉద్యోగులు బతుకమ్మ పాటలతో లయబద్ధంగా అడుగులు వేస్తూ ఉత్సాహంగా ఆడిపాడారు. మంత్రి సీతక్క వారితో కలిసి బతుకమ్మ ఆడటంతో సంబరాల్లో మరింత ఉత్సాహం నెలకొంది.అనంతరం ములుగు మండలానికి చెందిన 25 మంది, మల్లంపల్లి మండలానికి చెందిన ఏడుగురు కలిపి మొత్తం 32 మంది లబ్ధిదారులకు ముప్పై రెండు లక్షల మూడు వేల ఏడు వందల పన్నెండు రూపాయల విలువైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మంత్రి సీతక్క పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు, ములుగు మున్సిపాలిటీ చైర్‌పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఆసియా షాహిన్, రాష్ట్ర పంచాయతీ రాజ్ డైరెక్టర్ భగవాన్ రెడ్డి, కౌన్సిలర్లు, జిల్లా అధికారులు, మహిళా అధికారులు, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు..

రైతులకు కరెంట్ ఇవ్వలేని కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు?

- పంటలు ఎండిపోతుంటే మంత్రి సీతక్క ఏం చేస్తున్నారు?
- రైతుల సమస్యలు పరిష్కరించాలి..
- మంగపేట అభివృద్ధి పనులు పూర్తి చేయాలి
- కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత- కుడుముల లక్ష్మీనారాయణ ఆగ్రహం..

మంగపేట. ములుగు జిల్లా. అక్టోబర్ 16(సూర్యోదయ వార్త.)

ములుగు జిల్లా మంగపేట మండల బీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన పత్రిక సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. రైతులకు సక్రమంగా విద్యుత్ సరఫరా చేయడంతో పాటు, ఏటూరునాగారం--మంగపేట రహదారికి బీటీ రోడ్డు నిర్మించాలని, మంగపేట బస్టాండ్ పనులను వెంటనే పూర్తి చేయాలని, నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సమస్యలను పట్టించుకోకుండా, అభివృద్ధి పనులను నిర్లక్ష్యం చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరిస్తోందని విమర్శించారు.

రైతులకు న్యాయమైన కరెంట్ ఇవ్వలేని కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు?

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ నాయకత్వంలో వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందించామని బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు. ప్రస్తుతం విద్యుత్ కోతల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్‌ను సక్రమంగా సరఫరా చేయాలి.విద్యుత్ కోతలతో ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి రైతులు రెండో పంట సాగు చేయాలా వద్దా అనే విషయంలో ప్రభుత్వ పెద్దలు చేస్తున్న ప్రకటనలు రైతుల్లో ఆందోళన కలిగిస్తున్నాయని కుడుముల లక్ష్మీనారాయణ విమర్శించారు.రైతులకు సాగునీరు, విద్యుత్, పెట్టుబడి సాయం వంటి సదుపాయాలు కల్పించాల్సిన ప్రభుత్వం.. రెండో పంట వేయవద్దని చెప్పే పరిస్థితి ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు.రైతులకు రెండో పంట సాగుపై స్పష్టమైన విధానం ప్రకటించాలి.సాగుకు అవసరమైన విద్యుత్, నీటి సదుపాయాలు కల్పించాలి.

ఏటూరునాగారం--మంగపేట రోడ్డుకు వెంటనే ఒక లేయర్ బీటీ వేయాలి!

ఏటూరునాగారం--మంగపేట ప్రధాన రహదారిపై ప్రయాణించే ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ నేతలు విమర్శించారు.



ఈ రహదారి పరిస్థితి కారణంగా వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటూ, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు.

ఏటూరునాగారం--మంగపేట రోడ్డుపై వెంటనే ఒక లేయర్ బీటీ రోడ్డు నిర్మించాలి.

రహదారిపై ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి మరమ్మతులు చేపట్టాలి.
ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలి.
రహదారి పనులకు సంబంధించిన ప్రణాళిక, గడువును అధికారులు స్పష్టం చేయాలి.
ప్రజలు ప్రతిరోజూ ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరం. ప్రజలకు కనీస రహదారి సౌకర్యం కల్పించడం కూడా ప్రభుత్వ బాధ్యత కాదా?

మంగపేట బస్టాండ్ పనులు నత్తనడకన ఎందుకు సాగుతున్నాయి?

మంగపేట బస్టాండ్ పనులు నత్తనడకన సాగుతుండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కుడుముల లక్ష్మీనారాయణ విమర్శించారు. పనులు నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి కావాల్సి ఉండగా, నిర్లక్ష్యంగా పనులు నిర్వహించడం వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని ఆరోపించారు.ఈ సందర్భంగా ఆయన డిమాండ్లు:మంగపేట బస్టాండ్ పనులపై సంబంధిత అధికారులు తక్షణమే సమీక్ష నిర్వహించాలి.పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారో లేదో పరిశీలించాలి.అసంపూర్తిగా ఉన్న పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి.పనుల పూర్తికి స్పష్టమైన గడువు ప్రకటించాలి.బస్టాండ్‌ను ప్రజలకు, ప్రయాణికులకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలి.మంగపేట ప్రజలకు ఉపయోగపడాల్సిన బస్టాండ్‌ను నిర్లక్ష్యానికి వదిలేయడం సరికాదు. సంబంధిత మంత్రి, అధికారులు వెంటనే స్పందించి పనులను పూర్తి చేయాలి.

నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం అందించాలి!

- మంగపేట మండలంలో వ్యవసాయ సమస్యలు, విద్యుత్ కోతలు, ఇతర కారణాల వల్ల పంట నష్టాలను ఎదుర్కొంటున్న రైతులకు ప్రభుత్వం అండగా నిలవాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు.పంట నష్టపోయిన రైతులను గుర్తించి సమగ్రంగా సర్వే నిర్వహించాలి.అర్హులైన రైతులకు నిబంధనల ప్రకారం నష్టపరిహారం అందించాలి.పంట నష్టంపై అధికారులతో విచారణ జరిపించి వాస్తవాలను వెల్లడించాలి.రైతులకు పరిహారం అందించడంలో జాప్యం చేయకూడదు.రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి.రైతులు అప్పులు చేసి పంటలు సాగు చేస్తుంటే, పంట నష్టాలతో వారు మరింత అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఇలాంటి సమయంలో రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

మంత్రి సీతక్క రైతుల సమస్యలపై స్పందించాలి

ములుగు జిల్లాలో రైతులు విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే స్థానిక మంత్రి సీతక్క గారు ఎందుకు స్పందించడం లేదని కుడుముల లక్ష్మీనారాయణ ప్రశ్నించారు.రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని పేర్కొన్నారు.ములుగు జిల్లాలో వ్యవసాయ విద్యుత్ సమస్యలు, పంట నష్టాలు, రహదారుల దుస్థితి, అసంపూర్తి అభివృద్ధి పనులపై మంత్రి తక్షణమే దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.మంత్రి సీతక్క గారు ప్రజలకు సమాధానం చెప్పాలి: రైతులకు సక్రమంగా కరెంట్ ఎప్పుడు ఇస్తారు? పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఎప్పుడు అందిస్తారు? ఏటూరునాగారం--మంగపేట రోడ్డుకు బీటీ రోడ్డు ఎప్పుడు వేస్తారు? మంగపేట బస్టాండ్ పనులు ఎప్పుడు పూర్తి చేస్తారు?. సింగరేణి బొగ్గు సరఫరా, విద్యుత్ ఉత్పత్తిపై స్పష్టత ఇవ్వాలి!విద్యుత్ కోతలకు గల కారణాలను ప్రభుత్వం ప్రజలకు వివరించాలని కుడుముల లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు.విద్యుత్ ఉత్పత్తి, సరఫరా పరిస్థితిపై వాస్తవ వివరాలను వెల్లడించాలి.థర్మల్ విద్యుత్ కేంద్రాలకు అవసరమైన బొగ్గు నిల్వలు, సరఫరాపై స్పష్టత ఇవ్వాలి.. మంగపేట అభివృద్ధిపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి!మంగపేట మండలంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని కుడుముల లక్ష్మీనారాయణ కోరారు.రైతుల సమస్యలు పరిష్కరించడంతో పాటు రహదారులు, బస్టాండ్ వంటి ప్రజా అవసరాలకు సంబంధించిన పనులను నిర్లక్ష్యం చేయకుండా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు..-రైతులకు న్యాయం చేయాలి మంగపేట అభివృద్ధిని వేగవంతం చేయాలి -- ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలి!ఈ కార్యక్రమంలో మండల మాజీ ప్రధాన కార్యదర్శి గుండేటి రాజుయాదవ్, జిల్లా నాయకులు యడ్లపల్లి నర్సింహా రావు, కర్రీ శ్యాంబాబు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కోరం సంతోష్, మహిళా మండల మాజీ అధ్యక్షురాలు కాటూరి సుగుణ, బోర్ నర్సాపూర్ మాజీ గ్రామ కమిటీ అధ్యక్షులు రావుల రమణ,పార్టీ నాయకులు చల్లగురుగుల తిరుపతి,గుండారాపు రమేష్, అమిలి చంద్రం,పంజాల సత్యం, యూత్ నాయకులు కేక్కం జగదీష్, కర్రీ రామ్మోహన్,సోషల్ మీడియా వారియర్స్ బీసా సాంబయ్య, గుడివాడ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతివ్వండి

హైదరాబాద్ – రంగారెడ్డి – మహబూబ్‌నగర్, ఖమ్మం – నల్లగొండ – వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు సీపీఎం మద్దతివ్వాలని టీపీసీసీ అధ్యక్షులు బి.మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ గౌరవ సలహాదారులు, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు వారు శుక్రవారం సీపీఎం రాష్ట్ర కార్యాలయమైన ఎంబీ భవన్‌లో రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి.జ్యోతి, టి.సాగర్, పోతినేని సుదర్శన్‌రావు, బండారు రవికుమార్‌లతో సమావేశమయ్యారు. అనంతరం మహేశ్‌కుమార్‌గౌడ్ మీడియాతో మాట్లాడారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు కోరడానికి సీపీఎం రాష్ట్ర కార్యాలయానికి వచ్చామని చెప్పారు. దేశంలో నేడు నెలకొన్న రాజకీయ పరిస్థితుల్లో ఇండియా కూటమి ఆధ్వర్యంలో సర్‌పై కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, తదితర పార్టీలు పెద్ద ఎత్తున ఉద్యమాన్ని నడుపుతున్న విషయాన్ని గుర్తుచేశారు. రాష్ట్రంలో సీపీఎం, సీపీఐ తమతో కలిసి రావాలనీ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు తెలపాలని కోరామని చెప్పారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ...పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని కాంగ్రెస్ నేతలు తమను సంప్రదించారని తెలిపారు. గతంలో హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో తాము బలపర్చిన ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ రెండు సార్లు గెలిచారని గుర్తుచేశారు. ఖమ్మం-నల్లగొండ-వరంగల్ పట్టభద్రుల స్థానంలోనూ తాము బలపర్చిన అభ్యర్థులు ఘననీయంగా ఓట్లు సాధించారని తెలిపారు. ఈ నేపథ్యంలో తాము కూడా ఆ స్థానాల్లో పోటీ చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామనీ, వామపక్ష పార్టీలతో చర్చలు జరుగుతున్నాయని కాంగ్రెస్ నేతలకు చెప్పామన్నారు. తమ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశంలో, ఆ తర్వాత ఇతర వామపక్ష పార్టీలతో చర్చించిన నిర్ణయాన్ని ప్రకటిస్తామని తెలిపారు.

'క్రేజీ కల్యాణం'కు పాజిటివ్ టాక్!



హైదరాబాద్, అక్టోబరు 16 : అనుపమ పరమేశ్వరన్, అఖిల్ రాజ్, తరుణ్ భాస్కర్, వీకే నరేశ్ ప్రధాన పాత్రల్లో నటించిన కుటుంబ కథాచిత్రం 'క్రేజీ కల్యాణం' ప్రేక్షకుల ముందుకొచ్చింది. బద్రప్ప గాజుల దర్శకత్వం వహించిన ఈ సినిమాను ఆరో సినిమాస్ పతాకంపై బూసమ్ జగన్ మోహన్ రెడ్డి నిర్మించారు. సురేష్ బొబ్బిలి సంగీతం అందించగా, శ్యామ్ దుపటి ఛాయాగ్రహణం, శ్రవణ్ కటికనేని కూర్పు బాధ్యతలు నిర్వహించారు. ప్రేమ, పెళ్లి, కుటుంబ బంధాల నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రం అక్టోబరు 16న విడుదలైంది. ఒక రోజు ముందుగానే ప్రీమియర్ ప్రదర్శనలు ప్రారంభం కావడంతో సినిమా చూసిన ప్రేక్షకులు సామాజిక మాధ్యమాల్లో తమ అభిప్రాయాలను పంచుకుంటున్నారు. 'క్రేజీ కల్యాణం' ప్రథమార్ధం ప్రేక్షకులను ఆకట్టుకుందని కొందరు నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. బాలరాజు పాత్రలో తరుణ్ భాస్కర్ ఉత్సాహభరితమైన నటనతో మెప్పించారని ప్రశంసిస్తున్నారు. వీకే నరేశ్ నటన కూడా బాగుందని పేర్కొంటున్నారు. అయితే అనుపమ పరమేశ్వరన్ నటనా ప్రతిభను పూర్తిస్థాయిలో చూపించే సన్నివేశాలు సినిమాలో తక్కువగా ఉన్నాయని ఓ ప్రేక్షకుడు అభిప్రాయపడ్డాడు. మొత్తంగా ప్రథమార్ధం బాగుందని, ద్వితీయార్ధంపై ఆసక్తి నెలకొందని తన అభిప్రాయాన్ని పంచుకున్నాడు. మరోవైపు, అనుపమ పరమేశ్వరన్ నటనను ప్రశంసిస్తూ కొందరు ప్రేక్షకులు సానుకూల స్పందన వ్యక్తం చేస్తున్నారు. కథతో పాటు వినోదం కూడా బాగా కుదిరాయని, దసరా సందర్భంగా కుటుంబంతో కలిసి చూడదగ్గ చిత్రంగా ఉందని అభిప్రాయపడుతున్నారు. ఈ సినిమా అనుపమకు మంచి పునరాగమనంగా నిలుస్తుందని ఓ నెటిజన్ పేర్కొన్నాడు. ప్రీమియర్ ప్రదర్శనల అనంతరం వెలువడుతున్న అభిప్రాయాల్లో సినిమాకు సానుకూల స్పందన కనిపిస్తోంది. ముఖ్యంగా తరుణ్ భాస్కర్ నటన, వినోదాత్మక అంశాల గురించి ప్రేక్షకులు ప్రస్తావిస్తున్నారు. అయితే ఇవి కొందరు ప్రేక్షకులు సామాజిక మాధ్యమాల్లో వెల్లడించిన వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే. పూర్తి స్థాయి ప్రేక్షకుల స్పందన, వసూళ్లు వెలువడిన తర్వాతే సినిమా విజయంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



'రామాయణం' నుంచి మరో ట్రైలర్ విడుదల!

హైదరాబాద్, అక్టోబరు 16 : భారతీయ సినీ ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొల్పిన పౌరాణిక చిత్రం 'రామాయణం: రైజ్ ఆఫ్ ఎ లెజెండ్' నుంచి మరో ట్రైలర్ విడుదలైనట్లు సమాచారం. హిందీతో పాటు తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ ప్రచార చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చినట్లు కథనాలు పేర్కొంటున్నాయి. 'దంగల్'తో గుర్తింపు తెచ్చుకున్న నితేష్ తివారీ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడి పాత్రలో కనిపించనుండగా, సాయి పల్లవి సీతాదేవిగా నటిస్తున్నారు. వీరిద్దరి పాత్రలపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. మరోవైపు, కన్నడ స్టార్ యశ్ రావణుడి పాత్రలో కనిపించనుండటంతో ఈ చిత్రంపై అంచనాలు మరింత పెరిగాయి. భారీ నిర్మాణ విలువలు, పౌరాణిక నేపథ్యం, ప్రముఖ నటీనటుల కలయిక ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. తాజా ప్రచారం ప్రకారం, 'రామాయణం' తొలి భాగాన్ని 2026 నవంబరు 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని చిత్రబృందం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఐమ్యాక్స్ ఫార్మాట్‌లోనూ ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ప్రణాళికలు ఉన్నట్లు సమాచారం. అయితే విడుదల తేదీ, భాషలవారీగా ప్రదర్శన, ఇతర వివరాలపై అధికారిక ప్రకటనలను నిర్ధారించుకోవాల్సి ఉంది. భారతీయ ఇతిహాసమైన రామాయణం ఆధారంగా రూపొందుతున్న ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అంతర్జాతీయ ప్రేక్షకులను ఆకట్టుకునేలా సాంకేతిక ప్రమాణాలు, దృశ్య ప్రభావాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలుస్తోంది. రణ్‌బీర్ కపూర్, సాయి పల్లవి, యశ్ వంటి ప్రముఖ నటులు భాగం కావడంతో ఈ ప్రాజెక్టుపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. తాజా ట్రైలర్‌పై ప్రేక్షకుల స్పందన ఎలా ఉంటుందో చూడాలి. ట్రైలర్ విడుదల, సినిమా పేరు, నవంబరు 5 విడుదల తేదీ వంటి వివరాలను ప్రచురించే ముందు చిత్ర నిర్మాణ సంస్థ అధికారిక ప్రకటనతో సరిపోల్చండి.

వివాదాలకు మౌనమే సమాధానం..

మీరా జాస్మిన్ రీఎంట్రీ!

హైదరాబాద్, అక్టోబరు 16 : దక్షిణాది చిత్రసీమలో సహజసిద్ధమైన నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కథానాయిక మీరా జాస్మిన్. ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టి, మలయాళం, తెలుగు, తమిళ భాషల్లో ఎన్నో వైవిధ్యమైన పాత్రల్లో నటించి ప్రేక్షకుల మనసులు గెలుచుకున్నారు. తన నటనకు జాతీయ స్థాయిలోనూ గుర్తింపు పొందిన ఆమె కెరీర్‌లో విజయాలతో పాటు వివాదాలూ చోటుచేసుకున్నాయి. కొంతకాలం సినిమాలకు దూరంగా ఉన్న మీరా జాస్మిన్.. ఇప్పుడు మళ్లీ వరుస చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. కెరీర్‌లో మంచి అవకాశాలు అందుకుంటున్న సమయంలో మీరా జాస్మిన్ చుట్టూ పలు వివాదాలు నెలకొన్నాయి. షూటింగ్ సమయంలో ఆమె ప్రవర్తన, పారితోషికం విషయంలో డిమాండ్లు వంటి అంశాలపై అప్పట్లో అనేక కథనాలు ప్రచారంలోకి వచ్చాయి. ఈ ప్రచారాల్లో కొన్నింటిపై ఆమె స్పందించగా, మరికొన్నింటిని పట్టించుకోలేదు. అయితే, ఆ వివాదాలు ఆమె సినీ ప్రయాణంపై ప్రభావం చూపించాయనే చర్చ అప్పట్లో సాగింది. వ్యక్తిగత జీవితంలో కీలక నిర్ణయాలు తీసుకున్న మీరా జాస్మిన్ కొంతకాలం సినిమాలకు దూరంగా ఉన్నారు. దాదాపు పదేళ్లకు పైగా వెండితెరకు దూరమైన ఆమె.. మలయాళ దర్శకుడు సత్యన్ అంతిక్కాడ్ చిత్రంతో తిరిగి నటనను ప్రారంభించారు. పునరాగమనం తర్వాత కథల ఎంపికలో మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తూ, తన పాత్రకు ప్రాధాన్యం ఉన్న సినిమాలపై దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో తన చుట్టూ నెలకొన్న వివాదాలపై ఇప్పుడు పెద్దగా స్పందించకుండా, సినిమాలపైనే దృష్టి సారిస్తున్నారని కథనాలు పేర్కొంటున్నాయి. మోహన్‌లాల్‌తో కలిసి నటిస్తున్న 'అతి మనోహరం' చిత్రంపై కూడా ఆసక్తి నెలకొంది. గత అనుభవాలను పక్కనపెట్టి, పాత్రల ఎంపికతోనూ నటనతోనూ ప్రేక్షకులను ఆకట్టుకోవాలనే ప్రయత్నంలో మీరా జాస్మిన్ ముందుకు సాగుతున్నారు.



అది లేకపోతే అస్సలు కుదరదు

హైదరాబాద్, అక్టోబరు 16 : టాలీవుడ్ నటి శ్రీలీల తన నటనతోనే కాకుండా, వ్యక్తిగత అభిరుచులతోనూ అభిమానులను ఆకట్టుకుంటున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తనకు వంట చేయడమంటే ఇష్టమని వెల్లడించారు. సాంబారు, కొబ్బరన్నం, కుర్మా కూర వంటి పలు రకాల వంటకాలను సులభంగా తయారు చేయగలనని చెప్పారు. అయితే ఎన్ని రకాల వంటలు చేసినా తన భోజనంలో పెరుగన్నం తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. వంటల గురించి మాట్లాడుతూ శ్రీలీల తనకు ఇష్టమైన ఆహారపు అలవాట్లను పంచుకున్నారు. సాంబారు, కొబ్బరన్నం, కుర్మా కూరతో పాటు ఎన్నో వంటకాలు చేయగలనని తెలిపారు. అయితే చిన్నప్పటి నుంచే పెరుగన్నం అంటే తనకు ఎంతో ఇష్టమని, ఎలాంటి ప్రత్యేక వంటకాలు ఉన్నా చివర్లో పెరుగన్నం ఉండాల్సిందేనని సరదాగా చెప్పారు. దీంతో శ్రీలీల ఆహారపు అభిరుచులపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఇటీవల సినిమాల్లో ఎక్కువగా కనిపించడం లేదనే ప్రశ్నకు కూడా శ్రీలీల స్పందించారు. గత కొన్ని రోజులుగా వరుస చిత్రాల షూటింగులతో బిజీగా ఉన్నానని వెల్లడించారు. తాను నటిస్తున్న సినిమాలకు సంబంధించిన వివరాలను చిత్రబృందాలు ఇంకా అధికారికంగా ప్రకటించలేదని, అందువల్ల ప్రస్తుతానికి వాటి గురించి మాట్లాడలేనని స్పష్టం చేశారు. ప్రస్తుతం రెండు రోజుల విరామం లభించిందని శ్రీలీల తెలిపారు. షూటింగుల హడావుడి నుంచి కాస్త విరామం తీసుకుని ఈ సమయాన్ని కుటుంబ సభ్యులతో గడుపుతున్నానని చెప్పారు. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా కుటుంబంతో గడిపే సమయం తనకు ఎంతో విలువైనదని ఆమె మాటలను బట్టి తెలుస్తోంది. మరోవైపు, శ్రీలీల తదుపరి చిత్రాల వివరాల కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు.



నిత్య మీనన్ కోసం మూడు గంటలు..

'జమ్ము గరివిడి లక్ష్మి' వెనుక ఆసక్తికర విశేషాలు!

హైదరాబాద్, అక్టోబర్ 16 : వర్సటైల్ నటి నిత్య మీనన్‌ను తన సినిమాలో నటింపజేయడానికి దర్శకుడు గౌరి నాయుడు తీవ్రంగా ప్రయత్నించిన ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. 'జమ్ము గరివిడి లక్ష్మి' చిత్రంలోని సవాలుతో కూడిన ప్రధాన పాత్రకు నిత్య మీనన్ మాత్రమే న్యాయం చేయగలరని భావించిన గౌరి నాయుడు.. తొలుత కథ వినడానికి నిరాకరించిన ఆమెను ఒప్పించేందుకు ఎన్నో ప్రయత్నాలు చేశారు. అయితే, జూమ్ కాల్‌లో సుదీర్ఘంగా కథ విని ఆమోదం తెలిపినప్పటికీ, కొన్ని అనూహ్య పరిణామాల వల్ల ఈ ప్రాజెక్టులో నిత్య మీనన్ భాగం కాలేకపోయారని దర్శకుడు ఇటీవల వెల్లడించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మాత విశ్వప్రసాద్ సహకారంతో నిత్య మీనన్‌కు జూమ్ కాల్ ద్వారా కథ చెప్పే అవకాశం దక్కింది. కేవలం అరగంట మాత్రమే సమయం కేటాయిస్తానని నిత్య మీనన్ ముందే స్పష్టం చేయడంతో దర్శకుడిలో తీవ్ర ఆందోళన నెలకొంది. అయితే కథ ప్రారంభమైన అరగంటకే ముగిసినా, ఆసక్తికరంగా ఉండటంతో నిత్య మీనన్ మళ్లీ కాల్ చేసి కొనసాగించమని కోరారు. దాంతో దాదాపు మూడు గంటల పాటు సాగిన ఈ కథనం విన్న నిత్య మీనన్ తీవ్ర భావోద్వేగానికి గురై, సినిమా చేయడానికి అంగీకరించారు. అయితే, ఆ తర్వాత పారితోషికం, ఇతర ఒప్పంద నిబంధనల విషయంలో నిత్య మీనన్ బృందం, నిర్మాణ సంస్థ మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఆమె ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. ఈ చిత్రం సాధారణ కథ కాదని, 40 నుంచి 60 ఏళ్ల మధ్య వయసున్న ఒక వ్యక్తి జీవితంలోని వివిధ దశలను, మూడు భాషల యాసలను ప్రతిబింబించే నటన ప్రాధాన్యమున్న పాత్ర అని గౌరి నాయుడు వివరించారు. నిత్య మీనన్ తప్పుకోవడంతో ఆ పాత్రకు సరిపోయే నటి కోసం ఆరు నెలల పాటు అన్వేషణ సాగించామని, ఐశ్వర్య రాజేష్, అంజలి, ఆనంది వంటి నటీమణుల పేర్లను పరిశీలించినా సరైన ఎంపికను నిర్ణయించడం సవాలుగా మారిందని పేర్కొన్నారు.

